క్లుప్తంగా

తీరంలో వ్యర్థాల తొలగింపు


వ్యర్థాలను తొలగించిన సభ్యులు

కొమ్మాది: బీచ్ రోడ్డు తిమ్మాపురంలో ప్లాటిపస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బీచ్ క్లీన్ కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ సభ్యులు సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యర్థాలను తొలగించి, జీవీఎంసీ శానిటేషన్ విభాగానికి అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎండాడ హైస్కూల్ వద్ద గస్తీ ఏర్పాటు


గస్తీ కాస్తున్న పోలీసు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఆరిలోవ పోలీసులు గస్తీ ఏర్పాటు చేశారు. రాత్రి సమయాల్లో కొందరు ఆకతాయిలు పాఠశాలలో ప్రవేశించి విద్యుత్ వైర్లు, ఇతర సామాగ్రి ధ్వంసం చేస్తున్నందున, వాటిని అరికట్టేందుకు పోలీసులు పహారా కాస్తున్నారు. అనుమానితులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.

వాండ్రాసికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


ఆర్జేడీ విజయ భాస్కర్‌తో వాండ్రాసి సతీష్

తగరపువలస: భీమిలి నియోజకవర్గ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్ల యూనియన్ అధ్యక్షుడు, తగరపువలసలోని సాయి రవీంద్ర పాఠశాల ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. రాష్ట్ర ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూళ్ల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఈ అవార్డు అందించారు. అదే పాఠశాలకు చెందిన బయాలజీ ఉపాధ్యాయిని పి.సౌజన్యకు కూడా ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు లభించింది.

ముగిసిన టైప్‌రైటింగ్ పరీక్షలు


టైప్ రైటింగ్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

తగరపువలస: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో భీమిలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శని, ఆదివారాలలో నిర్వహించిన టైప్ రైటింగ్ పరీక్షలు ముగిశాయి. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషలలో జూనియర్, లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు జరిగాయి.

గుర్తు తెలియని వాహనం ఢీకొని బిచ్చగత్తె దుర్మరణం


మృతురాలు

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం జాతీయరహదారి వద్ద ఆదివారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొని బిచ్చగత్తె మృతి చెందింది. ఆనందపురం నుంచి తగరపువలస వెళ్లే మార్గంలో జరిగిన ఈ ప్రమాదంపై స్థానిక వీఆర్వో మజ్జి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఆనందపురం ఎస్‌ఐ పి.శివ దర్యాప్తు చేస్తున్నారు.

రాళ్లు తేలి.. గోతులమయమై..

అధ్వానంగా రహదారులు


శ్రీ ధర్మశాస్త్ర సేవాపీఠం సమీపంలో శిథిలమైన రోడ్డు


పద్మనాభం గ్రామంలో రోడ్డు మధ్య గోతులు


పద్మనాభం సచివాలయం సమీపంలో గోతుల్లో చేరిన వర్షపు నీరు

పద్మనాభం: మండలంలోని పద్మనాభం పోలీస్ స్టేషన్ నుంచి అనంతవరం జంక్షన్ నుంచి రోడ్డు శిథిలమైంది. దీంతో ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. విజయనగరం-సింహాచలం ఆర్ అండ్ బీ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న మూడు కిలో మీటర్ల నిడివి గల రోడ్డు మొత్తం గోతులు పడింది.

ఈ రోడ్డుపై విజయనగరం, సింహాచలం వెళ్లే బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిరంతరం తిరుగుతూ ఉంటాయి. విజయనగరం-విశాఖపట్నం జిల్లాలను కలిపే ఈ రోడ్డు వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. పద్మనాభం సచివాలయం సమీపంలో, పద్మనాభం గ్రామం, బ్రిడ్జి దగ్గర, మద్ది శ్రీధర్మశాస్త్ర సేవా పీఠం వద్ద రోడ్డు పెద్ద పెద్ద గోతులు పడి, ప్రమాదకరంగా తయారైంది. ఇక్కడ రోడ్డుపై పిక్కలు తేలిపోయాయి. వాహనాల రాకపోకలకు రేగిన ధూళి కళ్లలో పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

పద్మనాభం సచివాలయం వద్ద రోడ్డు వర్షాలకు చెరువును తలపిస్తోంది. గోతులు వర్షపు నీటితో నిండిపోవడంతో పగటి వేళల్లో కూడా మార్గం కనిపించక రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టడానికి ఆర్ అండ్ బీ శాఖ రూ.6 కోట్లు మంజూరు చేసింది. పద్మనాభం సచివాలయం వద్ద రోడ్డు అసంపూర్తిగా మరమ్మతులు చేపట్టారు. ఇది వర్షాలకు మళ్లీ గోతులు పడి, పిక్కలు తేలిపోయాయి. అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

గోతులతో ఇబ్బంది



రోడ్డంతా గోతులు పడడంతో ఈ మార్గంలో ప్రయాణమంటేనే భయంగా ఉంటోంది. రోడ్లన్నీ రాళ్లు తేలిపోయాయి. సచివాలయం వద్ద రోడ్డు చిన్న వర్షానికే చెరువులా మారిపోతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.అప్పలరాజు, కృష్ణాపురం

మరమ్మతులు చేపడతాం

నీళ్ల కుండీల జంక్షన్ నుంచి విజయానందపురం జంక్షన్ వరకు మరమ్మతులు చేపట్టేందుకు రూ.6 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో కొన్ని చోట్ల మరమ్మతులు చేశాం. అనివార్య కారణాల వల్ల మరమ్మతు పనులు నిలిచిపోయాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పనులు చేపడతాం.

– లలిత, ఆర్ అండ్ బీ ఏఈ

యువకుడిని రక్షించిన లైఫ్‌గార్డులు


కాపాడిన యువకుడితో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో ఓ యువకుడు కొట్టుకుని పోతుండగా లైఫ్‌గార్డులు ప్రాణాలు కాపాడారు. మధురవాడకు చెందిన ఐదుగురు స్నేహితులు ఆదివారం సాయంత్రం బీచ్‌లో స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో వీరిలో కె. హేమంత్ కొట్టుకునిపోతుండగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్ గార్డ్స్ చందు, అమ్మోరు, సతీష్ ఆ యువకుడిని గమనించి సురక్షితంగా తీరానికి తీసుకుని వచ్చారు. అతడికి మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి, ఇంటికి పంపించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం


బోయపాలెంలో ప్రచారంలో పాల్గొన్న ప్రబోధానందుని శిష్యులు

తగరపువలస: త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ఇందూజ్ఞాన వేదిక ప్రబోధ సేవాసమితి విజయరాంపురం కమిటీ ప్రతినిధులు ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బోయపాలెం, పరదేశిపాలెం, బోరవానిపాలెం గ్రామాల్లో పర్యటించిన వారు దసరా పండగలోని ఆధ్యాత్మిక విశేషాలను వివరించారు. ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలను యోగమార్గంలో నశింపజేయడమే దసరా పండగ అర్థమని, ఆచార్య ప్రబోధానంద గ్రంథాలలో ఈ విషయం తెలియజేశారని అన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కె.త్రినాథరావు, జి.కృష్ణ సూరప్పడు, ఎస్.శ్రీనివాసరావు, వి.భవాని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత


చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో శిక్షణకు హాజరైన విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎంఎంఎస్ శిక్షణలో పాల్గొన్న 170 మంది విద్యార్థులకు చిట్టివలస సత్యసాయిసేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అల్పాహారం అందించారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంటాన మోహనరావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణ కార్యక్రమంలో అధ్యక్షుడు దత్తి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు ఉపాధ్యాయులు యాగాటి వెంకటరమణ, దత్తి రవి తదితరులు పాల్గొన్నారు.

మానసిక వ్యాధితో బాధపడుతున్న మహిళ అదృశ్యం


పావని (ఫైల్)

పీఎం పాలెం: మానసిక వ్యాధితో బాధపడుతున్న మహిళ అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మధురవాడ స్వతంత్ర నగర్‌లో నివసిస్తున్న దుంపల నాగమ్మ (నాగమణి)కు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె పావని (26) మానసిక వ్యాధితో బాధపడుతోంది. సరిగా మాట్లాడలేదు. ఈ నెల 27వ తేదీన తల్లీ కుమార్తెల నడుమ చిన్న గొడవ జరిగింది. అదే రోజు రాత్రి 9.30 గంటల సమయంలో పావని ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. పరిసర ప్రాంతాల్లో వెదికినా ఫలితం లేకపోవడంతో పావని తల్లి నాగమణి పోలీసులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మధురవాడలో డిగ్రీ విద్యార్థిని..

డిగ్రీ విద్యార్థిని అదృశ్యంపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. మధురవాడలో నివసిస్తున్న మానేపల్లి కనకమహాలక్ష్మి కుమార్తె మౌనిక (19) నగరంలోని ఓ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. ఈ నెల 28న ఉదయం 7.30 గంటలకు కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరలేదు. చుట్టుపక్కల వెదికినా ఫలితం లేకపోవడంతో విద్యార్థిని తల్లి కనకమహాలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

జీవనం .. దినదిన గండం

- కనీస సదుపాయాలకు నోచుకోని బడుగు జీవితాలు
- ఒక్కరోడ్డు కూడా లేక కాలనీవాసుల అవస్థలు
- శిథిలమైన సామూహిక మరుగుదొడ్లు



కాలనీలో రోడ్డు ఇలా..


ఆరో వార్డులోని పాకల కాలనీ


శిథిలమైన సామూహిక మరుగుదొడ్లు

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డు పీఎం పాలెం పరిధిలోని పాకల కాలనీలో కనీస సదుపాయాలు లేక, కాలనీవాసులు దుర్భర జీవనం గడుపుతున్నారు. కాలనీలో సుమారు 150 కుటుంబాలు నివసిస్తున్నాయి. కొన్ని కుటుంబాలు షెడ్లలో, మరి కొన్ని ఇప్పటికీ పూరిపాకలలోనే జీవిస్తున్నాయి. కాలనీలో మురుగునీరు ప్రవహించేందుకు డ్రైనేజీలు లేకపోవడంతో వీధిలోనే మురుగు ప్రవహిస్తుంది. సరైన రోడ్లు లేకపోవడంతో వాన వస్తే ఇంటి నుంచి కాలు బయటకు పెట్టడానికి వీల్లేని పరిస్థితి. చినుకు పడితే రోడ్డంతా చిత్తడిగా మారుతోంది. కంబాల కొండ ఫారెస్టుకు చేరువలో ఉన్నందున భయంకరమైన విషసర్పాలు ఇళ్లల్లో చొరబడిన సంఘటనలు అనేకం ఉన్నాయని కాలనీవాసులు తెలిపారు. కాలనీ వాసుల వాడుక నీటి అవసరాలు తీర్చడానికి బోరు బావులు ఏర్పాటు చేయలేదు. కాలనీలో పూర్తిస్థాయిలో వీధి లైట్లు వెలగడం లేదు. చీకటి పడితే సందులగుండా కారు చీకటిలో ప్రయాణించి ఇల్లు చేరుకోడానికి నానా అవస్థలు పడవలసిందే. సామూహిక మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాలనీ సమస్యలపై జీవీఎంసీ అధికారులు స్పందించి పరిష్కరించాలని, మెరుగైన సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

నయనమనోహరంగా రాధాకృష్ణులు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: రాధాకృష్ణులు ప్రత్యేక అలంకరణలో నయనమనోహరంగా దర్శనమిచ్చారు. సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజా కార్యక్రమంలో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామ స్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో చూడచక్కగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు.

సాగర్‌నగర్‌లో పెట్రోల్ దొంగల హల్‌చల్


ద్విచక్రవాహనంలో పెట్రోల్ దొంగిలిస్తున్న దృశ్యం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో పెట్రోల్ దొంగలు రెచ్చిపోతున్నారు. రాత్రి సమయాల్లో ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్రవాహనాల్లో పెట్రోల్‌ను దొంగిలిస్తున్నారు రెండు నెలలుగా ఇదే సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. శనివారం అర్ధరాత్రి ఓ ఇంటి వద్ద ఓ యువకుడు పెట్రోల్ దొంగిలిస్తూ సీసీ ఫుటేజ్‌కు చిక్కాడు. ఇలాంటి వారిపై పోలీసులు నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మురుగునీటిలో వేములవలస మార్కెట్


వేములవలస వద్ద డ్రైనేజీ నిండి మార్కెట్‌లోకి ప్రవహిస్తున్న మురుగు


అపరిశుభ్రంగా ఉన్న డ్రైనేజీ వద్ద విక్రయానికి ఉంచిన చేపలు

అపరిశుభ్ర వాతావరణంలోనే చేపల విక్రయాలు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస మహాత్మాగాంధీ మార్కెట్‌ను ఆదివారం మురుగు ముంచెత్తింది. సమీపంలో డ్రైనేజీ శిథిలం కావడంతో పాటు పూడికతో నిండిపోవడంతో మురుగు మార్కెట్‌లోని రహదారి మీదుగా జాతీయ రహదారిపైకి చేరుతుంది. చాలావరకు వ్యాపారులు రోడ్డుకు ఇరువైపులా ఆనుకుని వ్యాపారాలు నిర్వహిస్తుంటారు. ప్రవహిస్తున్న మురుగునీరు వీరి దుకాణాల కింద నుంచి వెళ్తుండటంతో వినియోగదారులు ముక్కు మూసుకుని విక్రయాలు చేస్తున్నారు. శిథిలమైన డ్రైనేజీకి మరమ్మతులు చేసి, మార్కెట్ చుట్టూ పరిశుభ్రమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని వ్యాపారులు, వినియోగదారులు కోరుతున్నారు.

మట్టితో.. జీవకళ ఉట్టిపడేలా..

- అమ్మవారి విగ్రహాలకు ప్రాణం పోస్తున్న కళాకారులు
- ఆభరణాలు సైతం మట్టితో తయారీ


ఆర్డర్‌పై తయారుచేసిన అమ్మవారి విగ్రహం


మట్టితో అచ్చు వేసిన చిన్న విగ్రహాలు



మట్టితో చేసిన శివలింగం, ఆయుధాలు


మట్టితో తయారుచేసిన అమ్మవారి విగ్రహం

తగరపువలస: శరన్నవరాత్రులు సమీపిస్తున్న వేళ అమ్మవారి విగ్రహాలు చూడచక్కగా రూపుదిద్దుకుంటున్నాయి. ప్రకృతి హితమైన పండగపై ప్రజలకు అవగాహన పెరగడంతో ఉత్సవ కమిటీలు కోరిన మేరకు మట్టితోనే అమ్మవారి ప్రతిమలను తయారుచేస్తున్నారు. రాజస్థాన్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన కళాకారులు మట్టితోనే అమ్మవార్ల ప్రతిమలను రూపొందిస్తారు. ఎక్కువగా కోల్‌కత్తా కాళీ అమ్మవారి అలంకరణతో పెద్ద విగ్రహాలు తయారు చేస్తుంటారు. వీటి అలంకరణలకు మెటల్‌పై ఆధారపడతారు. చీరలు, తల కూడా కృత్రిమమైనవే వాడతారు. అయితే, జీవీఎంసీ రెండో వార్డు సంతపేట కుమ్మరివీధికి చెందిన కళాకారులు ఉత్సవ కమిటీలు కోరిన శాంత రూపాలలో అమ్మవారి విగ్రహాలు తయారు చేస్తున్నారు. 2 నుంచి 9 అడుగుల ఎత్తులో రూపొందించిన విగ్రహాలకు ఆభరణాలు, చీరలు, ఆయుధాలు అన్నీ మట్టితోనే చేస్తుండటం విశేషం. అరటికోట్ల గణేష్, అరటికోట్ల రాము, పొట్నూరు ప్రసాద్ అనే ముగ్గురు యువకులు రెండు నెలల క్రితమే మట్టి విగ్రహాల తయారీకి శ్రీకారం చుట్టారు. ఈ విగ్రహాలకు ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ నుంచి మేలైన చెరువు మట్టి, ఊక, వరి గడ్డి, కర్రలను మాత్రమే వినియోగిస్తున్నారు. వీటి ధర రూ.2వేలు మొదలుకుని రూ.20 వేల వరకు లభ్యమవుతున్నాయి. సరుగుడు కర్రలకు వరిగడ్డి, బురద పూసి తరువాత ఊక కలిపిన మట్టితో విగ్రహాలు పూర్తి చేస్తున్నారు. దుర్గాదేవి మట్టి విగ్రహాల కోసం 83319 36098, 80081 25338 నంబర్లలో సంప్రదించవచ్చని తయారీదారుడు అరటికోట్ల రాము తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

తగరపువలస: ఆనందపురం మండలంలో శనివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతున్నారు. సీఐ వాసునాయుడు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని యాత కణమాంకు చెందిన కోరుకొండ కృష్ణ(24) దిబ్బడిపాలెంలో జేసీబీ హెల్పర్‌గా పని చేస్తున్నాడు. సాయంత్రం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై సర్వీస్ రోడ్డులో కణమాం వైపు వెళ్తుండగా గొంతినవానిపాలెం వద్ద పెందుర్తి నుంచి ఆనందపురం వైపు వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో కృష్ణకు కుడికాలు, ఎడమ కన్నుపై తీవ్రంగా గాయాలయ్యాయి. క్షతగాత్రుడు నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఏఎస్‌ఐ యు.నూకరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- బొడ్డపాలెం వద్ద జరిగిన మరో ప్రమాదంలో మద్దిలపాలేనికి చెందిన బూస కృష్ణ(38) అనే టైల్స్ కలాసీని భీమిలి క్రాస్‌రోడ్డు నుంచి భీమిలి వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొనడంతో తలవెనుక, కుడికాలిపై తీవ్రంగా గాయాలయ్యాయి. ఇతనిని కేజీహెచ్‌కు తరలించి చికిత్స చేస్తున్నారు. ఈ కేసును హెచ్‌సీ నాగేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రధాన రహదారిపైనే వాహనాల పార్కింగ్


రుషికొండ వద్ద రోడ్డు మీదే పార్క్ చేసిన వాహనాలు

కొమ్మాది: రుషికొండ వద్ద ప్రధాన రహదారిపైనే వాహనాలను పార్క్ చేసేస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడు తోంది. రుషికొండ బీచ్‌కు పర్యాటకుల రద్దీ పెరగడంతో మెయిన్‌రోడ్డును ఆనుకుని పెద్ద ఎత్తున షాపుల నిర్మాణాలు చేపట్టా రు. కమర్షియల్ నిర్మాణానికి అనుమతి ఇచ్చేప్పుడు పట్టణ ప్రణాళిక విభాగం పార్కింగ్ స్థలాన్ని పరిశీలించాలి. కానీ అవేమీ పరిశీలించకుండా అనుమతి ఇవ్వడంతోవ్యాపారులు ఇష్టానుసారం నిర్మాణా లు చేపట్టారు. ఈ రోడ్డు వెంబడి ఏర్పాటు చేసినవన్నీ ఫుడ్‌కోర్టులు కావడంతో రోజంతా ఈ ప్రాంతాలు రద్దీగా ఉంటున్నాయి. ఇక్కడికి వచ్చిన వారు రోడ్డుపైనే బైకులు, కార్లు నిలిపి వేయడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంది. ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు స్పందించి నో పార్కింగ్ జోన్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.